# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి




సుబ్బులు, వెంకడు వెన్నెట్లో వల్లగాలికి కృష్ణ వొడ్డున కూర్చున్నారు. ఈనాటి మాటా! పదేళ్ళ క్రితం పెళ్ళయినప్పటి నుంచి ప్రవాహంలో అలల్లా, ముత్తయిదు నుదుటి మీద కుంకుం బొట్టులా ఒకర్నొకరు విడవకుండా, వానలో, ఎండలో, బీళ్ళలో, చాళ్ళలో, లంకల్లో, పుంతల్లో కలిసి మెలిసి తిరిగారు. అవేమి కతలో! అవేమి వూసులో! ఆ కలిసి అంబలి జుర్రుకోటం, ఆ కలిసి నక్షత్రాలు లెక్క పెట్టటం వాళ్ళకే చెల్లింది. గాలిలా స్వేచ్ఛగా, గడ్డిపువ్వుల్లా అమాయకంగా వున్నదే చాలనుకుని తృప్తిలో కాలం గడుపుతున్నారు.

సుబ్బులు పెద్దయ్యగారింట్లో పని చేస్తుంది. వెంకడు పెద్దయ్యగారి పొలం పనులు మాస్తాడు. పెద్దయ్యగారు భవంతి వెనకాల పాకేసి ఇచ్చాడు వీళ్ళిద్దరికీ. ఆ పూరి పాకనే ఇంద్రభవనం చేసుకుని ప్రతిక్షణం కలిసి అనుభవిస్తుంటే తెలియకుండానే పదేళ్ళు వెళ్ళిపోయాయి.

ఇవ్వాళ సుబ్బులెందుకో దిగులుగా వుంది. సుబ్బులు అలా వుంటే వెంకడికి కళ్ళనీళ్ళు తిరిగి పోతాయి. గిలగిల్లాడిపోయి అడిగాడు. "ఏందే అట్టుం డవు?" సుబ్బులు కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది. "ఏం లేదు మావా! మనం మనువాడి పదేళ్ళయి పోయింది. మవింట సంటోడు కెవ్వుమనలేదే ఓ బుడ్డోడు నేల పాకులాడలేదే అని"

వెంకడు కాస్సేపు మాట్లాడలేదు. ఆ తర్వాత తేరుకుని నవ్వుతూ అన్నాడు: "పోన్లేయే! మనకు తింటానికే సాలటం లేదే! మరింకోడెందుకులేయే!"

"ఆడదాని మనసు నీకు తెలవదు మావా? సంటోడు లేని ఇల్లు ఇల్లు కాదయ్యా! పెపంచకం మనతోనే ఆగిపోదు గదా! మన వొంశం నిలవాలంటే, మనకిన్ని నీళ్ళు వొదలాలంటే బుడ్డోడు కావాలయ్యా!" "అయితే వోర్నయినా పెంచుకుందామంటావే?" అన్నాడు సూటిగా మాస్తూ వెంకడు.

"పెంపుడు బిడ్డ మన బిడ్డవుతాడా?" అంది సుబ్బులు.

"అయితే ఏం వెయ్యమంటావ్?" అన్నాడు వెంకడు.

"నేను గొడ్రాలినని నాకు సింతలేదు. నువ్వు మగాడివి... పది మంది బిడ్డల్ని కంటావు. నా మాటిని, నువ్వు మారు మనువు సేసుకుని నాకు కొడుకును కనయ్యా" అంది సుబ్బులు.

వెంకడు అదిరిపడ్డాడు. దుఃఖం పొంగు కొచ్చింది. "అంత నీచప్పని నేం చేస్తానంటే? నిన్నొదులుకుని ఇంకొకత్తెని కట్టుకుని నీకు ద్రోహం చేస్తానంటే" అంటూ ఆవేశపడ్డాడు.

సుబ్బులు వెంకణ్ణి నెమ్మది పరుస్తూ గుండె నిమురుతూ "సల్లబడయ్యా! నిమ్మళంగాలోచించు. నువ్వెల్లప్పుడూ నా వోడివే! నాకు ద్రోహం తలపెట్టవు. మేమిద్దరం అప్పసెల్లెళ్ళలా వుంటాం. వొంశం కోసం మనువాడు మావా!"

'తప్పదేంటే!' అన్నాడు వెంకడు.

'నా కోసం మావా!' అంది సుబ్బులు.

కన్నీళ్ళతో సరేనని తలూపి గట్టు మీంచి లేచాడు వెంకడు.

మర్నాడే సుబ్బులు అంగాపురం వెళ్ళి పింతల్లి కూతురు లచ్చి సంబంధం ఖాయం చేసుకొచ్చింది. దగ్గరుండి పెళ్ళి జరిపించింది. పాకలో తడిక అడ్డం గట్టించి శోభనం నిశ్చయించింది. వెంకడు పెళ్ళయితే చేసుకున్నాడు కాని, రెండో పెళ్ళాన్ని పెళ్ళాంలా మాడ లేకపోతున్నాడు. ఏ అసూయా లేకుండా సుబ్బులు లచ్చికి జడవేసి అన్ని అలంకారాలు చేస్తుంటే వెంకడికి గుండె పీకినట్లయ్యేది. పూలు తెచ్చినా, మిఠాయి తెచ్చినా సుబ్బులుకి ఇచ్చేవాడు కాని లచ్చికి ఇచ్చేవాడు కాదు.

శోభనం నాటి రాత్రి తడిక అవతల వడీ వప్పుడూ లేకపోతే గొప్ప నిరాశపడింది సుబ్బులు. పది రోజులు గడిచాయి. వెంకడు లచ్చితో మాట మాత్రం మాట్లాడ లేదు.

ఒకరోజు సుబ్బులు లచ్చికి పూలు తురుముతుంటే లచ్చి అంది "ఎందుకక్కా నాకు పూలు? మావ నాతో పలకడు, ఉలకడు" అని. అప్పుడు సుబ్బులు చెప్పింది. "పిచ్చిదానా! మొగాడి మనసెరిగి మసులుకోవాలే! ఆడికేదిష్టమో తెలుసుకుని ముందుగా చేస్తే సంబరపడ్తాడు"

"అయితే మావకిష్టమయినట్టుంటాను. ఏం చెయ్యాలో చెప్పు" అంది లచ్చి ఆశగా.

సుబ్బులికి జాలేసింది. మావకి అంబలి ఇస్తావుగ దా! నువ్వు ముందు ఎంగిలి చెయ్యి. "అయ్యో! ఎంగిలముందే" అను. ఎందుకు చేశావంటాడు. "ఉప్పు కారం సాలిందో లేదో... నా మావకి రుసులు సమంగాలేని అంబలిస్తానా?" అను. రాత్రి పడుకునేప్పుడు పక్క మీద తెల్లదుప్పటే పరు. మావ తల క్రింద మెత్తటి దిండు పెట్టు. పడుకోబొయ్యేప్పుడు నీ తల్లోని పూల సెండు మావ తల దిక్కుగా పెట్టు" అంటూ చాలా చెప్పింది.

లచ్చి కళ్ళు మిల మిల మెరిశాయి. సరిగ్గా సుబ్బులు చెప్పినట్లే చేసింది లచ్చి. వెంకడు అబ్బురపోయాడు. కళ్ళెత్తి మాశాడు. దోసపండులాంటి లచ్చి. "నీ అక్క కూడా సరిగ్గా నీ లాగేనే!" అన్నాడు లచ్చి కళ్ళలోకి మాస్తూ. లచ్చి పొంగిపోయి అంబలి తనకి ఉంచుకోకుండా మొత్తమంతా మావ చేత తాగించింది.

తడిక పక్క నవ్వులు గుసగుసలు విన్పిస్తుంటే సుబ్బులు మనస్సు తేరుకుంది. మూడు నెలలకే లచ్చి నీళ్ళోసుకుంది.

అక్కడి నుంచి వెంకడు, సుబ్బులు పోటీపడి లచ్చికి కావాలసినవన్నీ ఏర్పాటు చేసేవారు. లచ్చిని బరువు పనులేవీ వెయ్యనివ్వటం లేదు సుబ్బులు. వెంకడు లచ్చి నలిగి పోతోందేమో అన్నట్టు మాస్తున్నాడు. తొమ్మిది నెలలు నిండిన ఓ రోజున ఆ పాకలో ఓ సంటాడు "కెవ్వు"మని ఏడిస్తే సుబ్బులుకి గుండె జలదర్రించి జల జల కన్నీళ్ళు కారాయి. ఆ క్షణం కోసం ఎన్ని సంవత్సరాలు కాచుకుంది?

ఎన్ని దేవుళ్ళకి మొక్కుకుంది.

వంటాణ్ణి గుండెలకి హత్తుకుని ధారలు ధారలుగా ఏడ్చింది.

నెలలు గడుస్తున్నాయి. చంటాడు తల్లి దగ్గర పాలు తాగటం తప్ప పెంపకమంతా సుబ్బులే. వాడితో నవ్వుతుంది. కథలు చెప్తుంది. పాటలు పాడుతుంది. ఏడుస్తుంది. చిచ్చికొడ్తూ తన పక్కలోనే పడుకో బెట్టుకుంటుంది.

కాని వెంకడు లచ్చి కితకితల్లో మునిగి పోయాడు. సుబ్బులుతో రోజుకి ఓసారి మాట్లాడతాడో లేదో! సుబ్బులు చంటాడ్ని వొళ్లో పడుకో బెట్టుకొని ఎప్పుడన్నా అనుకునేది "నాకు నా దేవుడు దూరవైపోయాడా? లేదు... లేదు... నా దేవుడిడుగో? నా వగ్గరే వున్నాడు" అంటూ చంటాణ్ని వొళ్ళంతా ముద్దులు పెట్టుకుంటుంది.

## ముత్యాలవాన